సాక్షి
పల్నాడు

సోమవారం । 1 । జనవరి । 2024



ఎస్టీయూ క్యాలెండ్ ఆవిష్కరణ

గుంటూరు ఎడ్యుకేషన్:ఎస్టీయూ క్యాలెండర్, డైరీని నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు ఆదివారం రింగ్ రోడ్డులోని తన కార్యాలయంలో ఆవిష్కరించారు.



సాగర్‌లో పర్యాటకుల సందడి

విజయపురిసౌత్: నాగార్జునసాగర్, విజయ పురిసౌత్‌లో ఆదివారం పర్యాటకుల సందడి నెలకొంది. రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలు భారీగా తరలివచ్చారు.



తిరుపతమ్మకు బంగారు గాజులు

పెనుగంచిప్రోలు:తిరుపతమ్మవారికి ఆదివారం ఇబ్రహీంపట్నం మండలం గుంటుపల్లి గ్రామానికి చెందిన దంపతులు 12 గ్రాముల బంగారు గాజులను బహూకరించారు.

న్యూస్‌రీల్

కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయంలో స్పందన రద్దు

నరసరావుపేట: నూతన సంవత్సరం వేడుకల నేపథ్యంలో సోమవారం జరిగే స్పందన కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేసినట్లు కలెక్టర్ ఎల్.శివశంకర్, ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి ఆదివారం వేర్వేరు ప్రకటనలలో పేర్కొన్నారు. అర్జీదారులు గమనించి ఎవరూ ఇతర ప్రాంతాల నుంచి కలెక్టరేట్, జిల్లా పోలీసు కార్యాలయాలకు రావద్దని వారు సూచించారు.

ఆంజనేయుని సన్నిధిలో హైకోర్టు జస్టిస్ జ్యోతిర్మయి



తెనాలిటౌన్: షరాఫ్‌బజార్‌లోని సువర్చలా సమేత పంచముఖ ఆంజనేయస్వామి ఆలయాన్ని ఆదివారం రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జ్యోతిర్మయి దంపతులు సందర్శించారు. దేవస్థానానికి విచ్చేసిన న్యాయమూర్తి దంపతులకు ఆలయ వంశపారంపర్య అర్చకులు రొంపిచర్ల శ్రీనివాసమూర్తి, వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయంలో న్యాయమూర్తి జ్యోతిర్మయి దంపతులు స్వామిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. వీరితోపాటు తెనాలి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి జి.రాజశేఖర్ ఉన్నారు. తొలుత ఆలయం చుట్టూ న్యాయమూర్తి దంపతులు ప్రదక్షిణలు చేశారు. మొక్కుబడులు సమర్పించుకున్నారు. అర్చకులు వారికి వేద ఆశీర్వచనం అందచేశారు. ఆలయ వ్యవస్థాపక కుటుంబ సభ్యులు ఎస్‌బీ శివ దంపతులు, ఆలయ కార్యనిర్వహణాధికారి అవుతు శ్రీనివాసరెడ్డి స్వామివారి జ్ఞాపికను వారికి అందజేశారు. శాలువాలతో సత్కరించారు. పంచముఖ ఆంజనేయస్వామి సంకీర్తన బృందం, సంకీర్తన సేవా సమితి సభ్యులు న్యాయమూర్తి దంపతులను సత్కరించారు. హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు ఆర్.కిరణ్‌కుమార్, సురేష్, వైఖానస పండితులు ఎన్‌జీఎల్ రఘురామ్, వేదాంతం నాగమారుతీ, వన్‌టౌన్ సీఐ రాజశేఖర్, పలువురు న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

పలు రైళ్ల దారి మళ్లింపు

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): గుంటూరు రైల్వే డివిజన్ గుంటూరు–నంద్యాల స్టేషన్ల మధ్య డబ్లింగ్ పనులు జరుగుతున్న నేపథ్యంలో పలు రైళ్లను దారి మళ్లించినట్టు డివిజన్ సీనియర్ డీసీఎం దినేష్‌కుమార్ ఆదివారం వెల్లడించారు. రైలు నంబర్ 17215 మచిలీపట్నం–ధర్మవరం రైలు జనవరి 2 నుంచి 4 వరకు కృష్ణా కెనాల్, తెనాలి, రేణిగుంట, పాకాల, మదనపల్లి మీదుగా ప్రయాణిస్తుందని తెలిపారు. రైలు నంబర్ 17216 ధర్మవరం–మచిలీపట్నం రైలు జనవరి 3 నుంచి 5 వరకు మదనపల్లి, పాకాల, రేణిగుంట, తెనాలి, కృష్ణాకెనాల్ మీదుగా ప్రయాణిస్తుందని తెలిపారు. ప్రయాణికులు అసౌకర్యాన్ని గమనించాల్సిందిగా సూచించారు.

దీక్ష విరమణ ఏర్పాట్ల పరిశీలన



విజయవాడ : దీక్ష విరమణలకు వచ్చే భవానీలకు ఇబ్బంది కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని దుర్గగుడి చైర్మన్ కర్నాటి రాంబాబు, ఈవో కేఎస్ రామారావు సిబ్బందికి సూచించారు. శ్రీ దుర్గా మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానంలో జనవరి 3 నుంచి 7వ తేదీ వరకు జరిగే భవానీ దీక్ష విరమణలు పురస్కరించుకుని దేవస్థానం చేస్తున్న ఏర్పాట్లను ఆదివారం చైర్మన్, ఈవో పరిశీలించారు. మహా మండపం ఎదుట హోమగుండాలు, ఇరుముడులు సమర్పించే కౌంటర్లు, ప్రసాదాల కౌంటర్లు, తలనీలాలు సమర్పించే కేశఖండనశాలలో ఏర్పాట్లను పరిశీలించి ఇంజినీరింగ్ అధికారులకు పలు సూచనలు చేశారు. భవానీల రద్దీ అధికంగా ఉండే వీఎంసీ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేస్తున్న హోల్డింగ్ పాయింట్లను పరిశీలించడంతో పాటు భవానీలకు తాగునీరు, ఇతర వసతులపై ఆరా తీశారు. అనంతరం సీతమ్మ వారి పాదాలు, ఇతర స్నాన ఘాట్లను పరిశీలించి షవర్లను తనిఖీ చేశారు. పర్యటనలో దేవస్థాన ఈఈ ఎల్.రమాదేవి, ఇతర ఇంజినీరింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం ఆదివారం 522.90 అడుగుల వద్ద ఉంది. సాగర్ జలాశయం నుంచి ఎస్ఎల్‌బీసీకి 450 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయ నీటిమట్టం 830.30 అడుగుల వద్ద ఉంది.



గుంటూరు నగరంలోని ఓ హాస్టల్లో జరిగిన వేడుకల్లో విద్యార్థినుల కేరింతలు

• ‘జన’వరి జోష్

విరిసిన ఆశలే తోరణాలుగా.. పెదవులపై నర్తించిన నవ్వులే కోటి ఉషస్సులుగా.. ముంగిళ్లలో మెరిసిన రంగవల్లులే హరివిల్లులుగా.. మదిలో వికసించిన సంతోషాల సుమాలే కాంతిరేఖలుగా.. లోకమంతా సంబరమై మురిసింది. నవోదయానికి వెలుగుపూల బాటై సుస్వాగతం పలికింది. కొత్త వత్సరానికి ఆహ్వానమంటూ నినదించింది. ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా ఆనందోత్సాహాలు అంబరాన్నంటాయి. కేక్ కటింగ్స్‌తో ఆబాలగోపాలం కేరింతలు కొట్టారు.

\- సాక్షి ఫొటోగ్రాఫర్, గుంటూరు





గుంటూరు నార్త్ ప్యారిస్ చర్చిలో ప్రార్థనల్లో పాల్గొన్న క్రీస్తు భక్తులు

నవ్వులు కురిపించెన్

సత్తెనపల్లి: సామాజిక పింఛన్ల పంపిణీలో మరో చారిత్రక ఘట్టానికి తెరలేవనుంది. ఇచ్చిన మాట ప్రకారం ఇప్పటివరకు అందిస్తున్న రూ. 2,750 సాయాన్ని రూ. 3 వేలకు పెంచుతూ రాష్ట్ర క్యాబినెట్ నిర్ణయించింది. ఈనెల నుంచి పెంచిన సాయం లబ్ధిదారులకు అందనుంది. వృద్ధాప్య, వితంతు, దివ్యాంగ, చేనేత, ఒంటరి మహిళలు, తదితర వర్గాల వారికి ఆసరాగా ప్రతినెలా ప్రభుత్వం వైఎస్సార్ పెన్షన్ కానుక పేరిట సామాజిక పింఛన్‌లు అందిస్తోంది. ఠంచనగా ఒకటో తేదీ వేకువ జాము నుంచి రాష్ట్ర వ్యాప్తంగా పింఛన్ల పంపిణీ పండుగలా సాగుతోంది. వలంటీర్, సచివాలయ సిబ్బంది లబ్ధిదారుల ఇళ్లకే వెళ్లి ఆప్యాయంగా పలకరిస్తూ పింఛన్ నగదు అందిస్తున్నారు.

- జనవరి నుంచి పింఛన్ రూ.3,000
- పెరగనున్న వైఎస్సార్ పింఛన్ కానుక
- హామీ నిలబెట్టుకుంటున్న సీఎం వై.ఎస్.జగన్
- ఆనందం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు
- జిల్లాలో 2,80,376 మంది పింఛన్‌దారులకు రూ.77.83 కోట్లు
- జిల్లా నుంచి మరో రూ.5.91 కోట్ల భారం

ఇచ్చిన మాటకు కట్టుబడి..

ఎన్నికలకు ముందు రూ.2 వేలుగా ఉన్న పింఛన్ సాయాన్ని దశలవారీగా రూ.3 వేలకు పెంచుతానని విపక్ష నేతగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాడు హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన వెంటనే రూ.2,250కు పెంచారు. దశలవారీగా ఇప్పుడు రూ.3 వేలకు పెంచారు. ప్రతినెలా ఒకటో తేదీనే పొద్దు పొడవక ముందే వలంటీర్లను ఇంటివద్దకే పంపి పింఛన్ సొమ్ములు అందిస్తున్నారు. అనారోగ్యంతో లబ్ధిదారులు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతుంటే మానవతా దృక్పథంతో వలంటీర్లు వారి చెంతకు వెళ్లి మరీ పింఛన్ సాయం అందిస్తున్నారు.



పుట్టపర్తిలో చికిత్స పొందుతున్న సత్తెనపల్లి చేనేత కార్మికుడికి అక్కడికే వెళ్లి పింఛన్ ఇచ్చి వేలిముద్ర తీసుకుంటున్న వలంటీర్ కోటీశ్వరి(ఫైల్)

నాడు ప్రహసనంలా..

గత టీడీపీ హయాంలో లబ్ధిదారుల ఎంపిక నుంచి నగదు పంపిణీ వరకు ప్రహసనంగా సాగేది. కొత్తగా పింఛన్ దరఖాస్తు చేసుకునే వారు జన్మభూమి కమిటీ సభ్యులను ప్రసన్నం చేసుకునేందుకు వాళ్ళ చుట్టూ కాళ్లు అరిగేలా తిరగాల్సి వచ్చేది. నగదు కోసం ఒకటో తేదీ నుంచి కమ్యూనిటీ హాళ్లు, ఆలయాలు, పంచాయతీ కార్యాలయాల వద్ద వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు పడిగాపులు పడాల్సి వచ్చేది. ఒక్కోసారి 15 రోజుల వరకు కూడా సొమ్ము అందక ఇబ్బందులు పడాల్సి వచ్చేది.

నేడు అర్హతే ప్రామాణికంగా..

ప్రస్తుత ప్రభుత్వం అధికారం చేపట్టగానే అర్హతే ప్రామాణికంగా అవినీతికి తావు లేకుండా పింఛన్ లబ్ధిదారుల ఎంపికకు శ్రీకారం చుట్టింది. కొత్తగా దరఖాస్తు చేసుకునేవారు ఎక్కడికీ తిరగాల్సిన పని లేదు. వివరాలను వలంటీర్లకు తెలియజేస్తే చాలు. సచివాలయాల్లో పేర్లు నమోదు చేయించి పింఛన్లు మంజూరు చేయించేలా వ్యవస్థలో మార్పులు తెచ్చారు. 2022 జనవరి నుంచి రూ.2,500లకు, 2023 జనవరి నుంచి రూ.2,750కి మొత్తాన్ని పెంచుకుంటూ వచ్చారు. తాజాగా జనవరి నుంచి రూ.3 వేలకు పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు.

కన్న కొడుకులా ఆదుకున్నారు



ప్రతినెలా మా ఇంటికి వచ్చి పింఛన్ అందిస్తున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మమ్మల్ని కన్నకొడుకులా ఆదుకుంటున్నారు. ప్రతినెలా ప్రభుత్వం ఇస్తున్న పింఛన్‌తో నేను ఆర్థిక అవసరాలకు ఎవరిపైనా ఆధారపడకుండా జీవిస్తున్నాను. ప్రభుత్వం ఇస్తున్న పింఛన్ రూ.2,750 నుంచి రూ.3 వేలకు పెంచుతుండటం చాలా ఆనందంగా ఉంది. ఈ ప్రభుత్వం పది కాలాలపాటు ఉండాలి.

\- దామవరపు. సోమమ్మ, వృద్ధురాలు

మాలాంటోళ్లకు మేలు



నా భర్త చనిపోయి నాలుగేళ్లు అవుతుంది. పిల్లలకు పెళ్లిళ్లు అయిపోయాయి. ప్రభుత్వం ఇచ్చే పింఛన్ డబ్బులు ఆసరాగా ఉంటున్నాయి. ఏటా రూ.250 పెంచుతూ ఇప్పుడు రూ.3 వేలు చేయడం ఎంతో సంతోషంగా ఉంది. పింఛన్ ద్వారా నా జీవితంలో సీఎం వైఎస్ జగన్ వెలుగు నింపారు. ఆయనకు ఎప్పటికీ రుణపడి ఉంటాను.

\- పొట్టింపూడి కోటి మహాలక్ష్మమ్మ, వితంతువు

నియోజకవర్గాల వారీగా పింఛన్లు ఇలా..				
నియోజకవర్గం	పింఛన్‌లు	కొత్త పింఛన్‌లు	మొత్తం పింఛన్‌లు	నగదు (రూ.కోట్లు)
నరసరావుపేట	33,254	500	33,754	10.11
చిలకలూరిపేట	37,707	476	38,183	11.38
గురజాల	43,725	477	44,202	13.22
మాచర్ల	42,982	292	43,274	12.98
పెదకూరపాడు	40,046	534	40,580	12.12
సత్తెనపల్లి	40,137	478	40,615	12.09
వినుకొండ	41,722	238	41,960	12.51
మొత్తం	2,79,573	2,995	2,82,568	84.41
ఏఆర్‌టీ పింఛన్‌లు(హెచ్ఐవి) జిల్లా వ్యాప్తంగా			1,541	0.46
మొత్తం			2,84,109	84.87

రూ.2,750 నుంచి రూ.3 వేలకు పెరిగిన పింఛన్‌లు ఇలా...				
పెన్షన్ కేటగిరి	డిసెంబర్ పింఛన్‌లు	రూ.2,750 చొప్పున (రూ.లక్షల్లో)	జనవరి పింఛన్‌లు మొత్తం	రూ.3వేలతో (రూ.లక్షల్లో)
ఓఏపీ	1,49,636	4114.99	1,50,118	4503.54
చేనేత	2,259	62.12	2,255	67.65
వితంతు	66,802	1837.06	67,677	2030.31
కల్లుగీత కార్మికులు	334	9.19	334	10.02
మత్స్యకారులు	717	19.72	714	21.42
ఒంటరి మహిళలు	12,048	331.32	12,054	361.62
చర్మకారులు	4,662	128.21	4,661	139.83
పీఎల్(హెచ్ఐవీ)	1,556	42.79	1,541	46.23

జిల్లాలో రూ.84.85 కోట్లు..

పల్నాడు జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో సామాజిక పింఛన్ లబ్ధిదారులు 2,79,573 మంది ఉన్నారు. వీరికి ప్రభుత్వం రూ.83.49 కోట్ల మొత్తాన్ని పింఛన్ సాయంగా అందిస్తోంది. తాజాగా జిల్లాకు 2,995 కొత్త పింఛన్‌లు మంజూరయ్యాయి. దీంతో 2,82,568కి పింఛన్‌లు పెరగ్గా రూ.84.39 కోట్లు చెల్లింపులు చేయనున్నారు. ఇవి గాక జిల్లా వ్యాప్తంగా ఏఆర్‌టీ(హెచ్ఐవీ) పింఛన్‌లు 1,541 మంజురయ్యాయి. అన్ని పింఛన్‌లు కలిపి 2,84,109 కాగా రూ. 84.87 కోట్లు లబ్ధిదారులకు చెల్లింపులు చేయనున్నారు. పింఛన్ సాయాన్ని పెంచనుండడంపై లబ్ధిదారులు ఆనంద వ్యక్తం చేస్తున్నారు. తమ జీవన ప్రమాణాలు మరింత మెరుగు పడేందుకు ఈ పెంపు దోహద పడుతుందని అంటున్నారు.

పింఛన్ పెంపుపై ప్రజలకు అవగాహన కల్పించండి

నరసరావుపేట: ప్రభుత్వం ప్రతినెలా అందజేసే సామాజిక భద్రతా పింఛన్లు ఒకటో తారీకు నుంచి రూ.250లు పెరగనున్న నేపథ్యంలో జనవరి మూడు నుంచి ఎనిమిది వరకు గ్రామాలు, మండలాలు, జిల్లా స్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ ఎల్.శివశంకర్ పేర్కొన్నారు. శనివారం సాయంత్రం కలెక్టరేట్‌లో ప్రభుత్వ పథకాల అమలుపై జిల్లా రెవెన్యూ డివిజన్ అధికారులు, మండల ప్రత్యేక అధికారులు, జిల్లా అధికారులు, పలువురు తహసీల్దార్లు, ఎంపీడీఓలు, మండల కో- ఆర్డినేటర్లు, మున్సిపల్ కమిషనర్లు, ఎంఈఓలు, మండల అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. వైఎస్సార్ చేయూత, ఆసరా, పెన్షన్లు, జగనన్న ఆరోగ్య సురక్ష-2, 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహం ఆవిష్కరణ ప్రత్యేక కార్యక్రమాల రూపకల్పన, బంగారు తల్లి-2, మిషన్ శుభకృత్, సరిహద్దు బోర్డుల ఏర్పాటు తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. జగనన్న ఆరోగ్య సురక్ష 2.0 జనవరి రెండో తేదీ నుంచి ప్రారంభించనున్న నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాల్లో మంగళవారం, బుధవారం, పట్టణ ప్రాంతాల్లో గురువారం, శుక్రవారం ప్రత్యేక క్యాంపులు నిర్వహించాలన్నారు. వైఎస్సార్ ఆసరా జనవరి 23న ప్రారంభించనున్న నేపథ్యంలో 17 నుంచి ప్రజల్లో అవగాహన, ముందస్తు ఏర్పాట్లు, సక్సెస్ స్టోరీలు, ఫొటోలను అప్‌లోడ్ చేయాలన్నారు. విజయవాడలో 125 అడుగుల ఎత్తు అంబేడ్కర్ విగ్రహం జనవరి 19న ఆవిష్కరించనున్న సందర్భంగా 12 వరకు జిల్లాలోని ప్రతి సచివాలయంలో సామాజిక న్యాయం - అంబేడ్కర్ ఆశయాల గురించి చర్చా కార్యక్రమాలు నిర్వహించాలని పేర్కొన్నారు. వైఎస్సార్ చేయూత ఫిబ్రవరి 5న ప్రారంభించనున్న నేపథ్యంలో జనవరి 27 నుంచే ముందస్తు ఏర్పాట్లు చేయాలన్నారు. కరపత్రాలను ముద్రించి పంపిణీ చేయాలన్నారు. ఆడుదాం ఆంధ్రా కార్యక్రమానికి సంబంధించి డ్యాష్ బోర్డులో వివరాలు నమోదు చేయాలన్నారు. పీఎం విశ్వకర్మ పథకంపైనా సూచనలు, సలహాలు ఇచ్చారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్, డీఆర్వో కె.వినాయకం పాల్గొన్నారు.



కలెక్టరేట్ నుంచి అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ శివశంకర్

జీజీహెచ్‌లో 25 పడకలతో ఐసీయూ

- ఆధునిక వైద్య సౌకర్యాలతో ప్రారంభానికి సిద్ధం
- రూ. 3 కోట్లతో ఇంటెన్సివ్ కేర్ నిర్మాణం

గుంటూరు మెడికల్: పేద రోగులకు శుభవార్త. గుంటూరు జీజీహెచ్‌లో నూతన ఏడాది 2024లో మరో అత్యాధునిక వైద్య విభాగం అందుబాటులోకి రానుంది. ప్రాణాపాయ స్థితిలో చికిత్స అందించి రోగుల ప్రాణాలు కాపాడే ఐసీయూ, వెంటిలేటర్ వైద్యసేవలు పూర్తి ఉచితంగా అందనున్నాయి. రూ.3 కోట్లతో సకల సౌకర్యాలతో 25 పడకలతో నిర్మించిన ఇంటెన్సివ్ కేర్ యూనిట్(ఐసీయూ) ప్రారంభానికి సిద్ధమైంది. జనవరి మొదటి వారంలో ఈ ఐసీయూను ప్రారంభించేందుకు ఆస్పత్రి అధికారులు రంగం సిద్ధం చేస్తున్నారు.

జీజీహెచ్‌పై ప్రత్యేక శ్రద్ధ

గుంటూరు జీజీహెచ్‌పై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధపెట్టి కోట్లాది రూపాయల వైద్య పరికరాలు ఆస్పత్రికి మంజూరు చేశారు. రాష్ట్రంలో ఏ ఆస్పత్రికి లేని విధంగా ఈ ఏడాదిలో రూ.25 కోట్లు ఖరీదు చేసే పెట్ సీటీస్కాన్ వైద్య పరికరం, రూ.4 కోట్లు ఖరీదు చేసే సీటీ స్కాన్ వైద్య పరికరం, ఇతర వైద్య పరికరాలు మంజూరు చేశారు. సర్వీస్ బ్లాక్ నిర్మాణం కోసం రూ.7.5 కోట్లు, కాకుమానువారితోట హాస్పిటల్ ప్రహరీ నిర్మాణం కోసం రూ.3.5 కోట్లు సీఎం మంజూరు చేశారు. ఆస్పత్రి మరమ్మతుల కోసం ఇటీవల కేటాయించిన నిధులతో జీజీహెచ్ క్యాజువాలిటీలో కోవిడ్ కాలంలో రోగులను ఉంచిన ప్రదేశంలో ప్రస్తుతం ట్రాన్సిట్ అడ్వాన్స్‌డ్ ఐసీయూను నిర్మాణం చేశారు.



ప్రారంభానికి సిద్ధమైన ఐసీయూ

సాక్షి Smart Economic Display — నూతన సంవత్సర శుభాకాంక్షలు 2024

మంత్రి రజిని నూతన సంవత్సర శుభాకాంక్షలు



పట్నంబజారు: నూతన సంవత్సరం పురస్కరించుకుని ప్రజలందరికీ రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి, గుంటూరు పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త విడదల రజిని శుభాకాంక్షలు తెలియజేశారు. నూతన సంవత్సరంలో ప్రతి ఇంట సంక్షేమ కాంతులు విరబూయాలని, ఆనందోత్సాహాలతో ప్రతి కుటుంబం సంతోషాల నడుమ జీవించాలని ఆకాంక్షించారు. రాష్ట్రాన్ని సంక్షేమ పథంలో ముందుకు తీసుకుని వెళ్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేస్తున్న ప్రతి మంచి పనికి ఆ భగవంతుడి ఆశీస్సులు ఉండాలని ఆకాంక్షించారు. నూతన సంతవ్సరం రోజున కొరిటెపాడులోని ప్రధాన రహదారిలో నూతన పశ్చిమ నియోజకవర్గ కార్యాలయం ప్రారంభోత్సవం నేపథ్యంలో వైఎస్సార్ సీపీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు.

మంత్రి అంబటి నూతన సంవత్సర శుభాకాంక్షలు



సత్తెనపల్లి: రాష్ట్ర ప్రజలకు జలవనరుల శాఖా మంత్రి అంబటి రాంబాబు ఆదివారం నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కొత్త సంవత్సరంలో ప్రతి ఒక్కరూ నూతన లక్ష్యాలను ఏర్పాటు చేసుకొని లక్ష్యసాధన కోసం కృషి చేయాలన్నారు. కొత్త సంవత్సరంలో అందరికి మంచి జరగాలని ఆకాంక్షించారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని సోమవారం ఉదయం 8 గంటల నుంచి సత్తెనపల్లిలోని వైఎస్ఆర్ సీపీ నియోజకవర్గ కార్యాలయంలో అందుబాటులో ఉంటానన్నారు.నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసేందుకు వచ్చేవారు విద్యార్థులకు ఉపయోగపడే నోటు పుస్తకాలు, పరీక్షా ప్యాడ్‌లు, వృద్ధులకు ఉపయోగపడే దుప్పట్లు, పర్యావరణ పరిరక్షణకు దోహదపడే మొక్కలను తీసుకు రావాలని కోరారు.

కలెక్టర్ నూతన సంవత్సర శుభాకాంక్షలు



నరసరావుపేట: కలెక్టర్ ఎల్.శివశంకర్, ఎస్పీ వై.రవి శంకర్‌రెడ్డి జిల్లా ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలను ఆదివారం తెలిపారు. ప్రజలంతా ఆయురారోగ్యాలు, సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. రాగద్వేషాలకు అతీతంగా అంతా ఐక్యంగా అభివృద్ధి వైపు అడుగులు వేయాలని కోరారు.

సంక్షేమ పాలనను ప్రజల్లోకి తీసుకువెళ్లండి



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి అంబటి రాంబాబు



సమావేశంలో ఐక్యతను చాటుతున్న మంత్రి అంబటి రాంబాబు, నాయకులు

- రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి అంబటి రాంబాబు
- వైఎస్సార్‌సీపీ యువజన విభాగం ఆధ్వర్యంలో భారీ ర్యాలీ, సమావేశం

సత్తెనపల్లి : సకలజన సంక్షేమం, పారదర్శక పాలనతో అన్ని వర్గాల అభివృద్ధికి కృషి చేసిన ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి సుపరిపాలనను ప్రజల్లోకి తీసుకెళ్లి వారిని చైతన్యం చేయాల్సిన బాధ్యత వైఎస్సార్ సీపీ యువజన విభాగానిదేనని రాష్ట్ర జల వనరుల శాఖా మంత్రి అంబటి రాంబాబు అన్నారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో ఆదివారం నియోజకవర్గంలోని వివిధ మండలాల యువజన విభాగం అధ్యక్షులు, జిల్లా కమిటీకి ఎంపికైన సభ్యులతో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన అభినందన సభ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను 98 శాతం నెరవేర్చటం జరిగిందన్నారు. చెప్పిన ప్రకారం వైఎస్సార్ పింఛన్ కానుకను రూ. 3 వేలకు పెంచి సోమవారం నుంచి పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. చంద్రబాబు తన పాలనలో ఇచ్చిన 600 హామీల్లో ఒక్కటి కూడా అమలు చేయలేక పోయారని, ప్రజలు ప్రశ్నిస్తారనే భయంతో మేనిఫెస్టో కూడా ఇంటర్నెట్‌లో లేకుండా తొలగించారన్నారు. జన్మభూమి కమిటీలను ఏర్పాటు చేసి అందిన కాడికి దోచుకున్నారన్నారు. అందుకే గత ఎన్నికల్లో చిత్తు చిత్తుగా ఓడిపోయారన్నారు. ప్రజల్లో విశ్వాసం లేక టీడీపీ, జనసేన పార్టీలు కలిసి వస్తున్నాయని, వారు సరిపోక మరో పార్టీని కూడా వెతుక్కుంటున్నారని ఎద్దేవా చేశారు. చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లు ఎంత మంది కలిసి వచ్చినా, ఎవరెవరు తోడుగా కట్ట కట్టుకొని వచ్చినా జగన్‌మోహన్ రెడ్డిని ఓడించలేరని, ప్రజల ఆశీర్వాదం ఉన్నంత కాలం వైఎస్సార్ సీపీకీ తిరుగులేదన్నారు. గుంటూరు మిర్చి యార్డ్ చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం పల్నాడు జిల్లా అధ్యక్షుడు పడాల శివారెడ్డి తదితరులు మాట్లాడారు. ముందుగా నరసరావుపేట రోడ్డులోని చెక్ పోస్ట్ వద్ద నుంచి భారీ సంఖ్యలో ర్యాలీ నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ కార్యాలయం వరకు జరిగిన ఈ ర్యాలీలో అభిమానులు జై జగన్, జై అంబటి అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో సత్తెనపల్లి పట్టణ, రూరల్, ముప్పాళ్ల, రాజుపాలెం, నకరికల్లు మండల లాల యువజన విభాగం అధ్యక్షులు శెట్టి ఆనంద్, తేలుకుట్ల సైదారావు, షేక్ మహబూబ్ సుభాని, భత్తుల శివయ్య, ఎస్‌కె నన్నేసా, పల్నాడు జిల్లా కార్యదర్శులు గొంటూరి వెంకటరామిరెడ్డి, కాటమనేని రామచంద్రరావు, సయ్యద్ అహ్మద్, బొడ్డు వెంకటేష్, లింగాల రామరాజు తదితరులను మంత్రి అంబటి రాంబాబు, ముఖ్య అతిథులు అభినందించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్లు షేక్ నాగుర్ మీరాన్, రమావత్ కోటేశ్వరరావు నాయక్, పట్టణ పార్టీ అధ్యక్షులు షేక్ మౌలాలి, మండలాల కన్వీనర్లు రాయపాటి పురుషోత్తమరావు, నర్రా శ్రీను, వేపూరి శ్రీనివాసరావు, భవనం రాఘవరెడ్డి, నాయకులు బాసు లింగా రెడ్డి, కళ్లం విజయభాస్కర్‌రెడ్డి, ఎమ్‌జీఎమ్ రామలింగారెడ్డి, అచ్యుత శివప్రసాద్, కట్టా సాంబయ్య, చిలకా జైపాల్, జెడ్పీటీసీ ఇనోజ్ల్లుల బొంతు వెంకటరెడ్డి, రెండెద్దుల వెంకటేశ్వరరెడ్డి, కౌన్సిలర్లు, అనుబంధ విభాగాల బాధ్యులు, నాయకులు, కార్యకర్తలు, తదితరులు ఉన్నారు.

రైతుభరోసా కేంద్రాల్లో కందుల కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



శావల్యాపురం: జిల్లాలో ప్రభుత్వం నిబంధనల మేరకు అన్ని రైతు భరోసా కేంద్రాల్లో కందుల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు జాయింట్ కలెక్టర్ ఎ.శ్యాంప్రసాదు వెల్లడించారు. ఆదివారం మండల కేంద్రం శావల్యాపురంలో శుపనిర్వార పదవీ విరమణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కంది పంట సాగు చేసిన రైతుల నుంచి క్వింటాకు మద్దతు ధర రూ.7500లు చొప్పున నేరుగా కొనుగోలు చేస్తామన్నారు. రైతులు దళారుల ద్వారా మోసపోకుండా ఉండేలా ప్రభుత్వం పటిష్టమైన చర్యలు చేపట్టిందన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా గోనె సంచులు, కూలీల ఖర్చు కూడా ప్రభుత్వమే భరిస్తుందన్నారు. కందులు అమ్మిన వారం రోజుల్లో రైతు బ్యాంకు ఖాతాలో నేరుగా నగదు ప్రభుత్వమే జమ చేస్తుందన్నారు. అసైన్డ్ భూముల 20 సంవత్సరాల పాటు తమ ఆధీనంలో ఉన్నట్లు ఆధారాలు ఉన్నట్లు వంటి రైతులకు భూమి హక్కు కల్పించేలా ప్రభుత్వం జీవో జారీ చేసిందన్నారు.

జెడ్పీ చైర్‌పర్సన్ నూతన సంవత్సర శుభాకాంక్షలు



గుంటూరు ఎడ్యుకేషన్: ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రజలు, ప్రజా ప్రతినిధులతో పాటు అధికార యంత్రాంగానికి జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా సురేష్‌కుమార్ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. నూతన సంవత్సరం ప్రజలందరి జీవితాల్లో నూతన ఆనందాలు, సంతోషాలను నింపాలని కోరుకుంటూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనలో అన్ని వర్గాల ప్రజలందరు సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు.



దళిత యువకులపై దాడి

నకరికల్లు: కులోన్మాదులకు అధికారం వస్తే దళితుల మనుగడే ప్రశ్నార్థకంగా మారుతుందని పలు దళితసంఘాల నాయకులు మండిపడుతున్నారు. మండలంలోని కుంకలగుంట గ్రామంలో జనసేనపార్టీ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి జెండా ఆవిష్కరణ కార్యక్రమం చేపడుతున్నారు. ఈ కార్యక్రమానికి క్రోసూరు మండలం నుంచి డీజే వాహనంలో దళిత సామాజికవర్గానికి చెందిన నలుగురు యువకులు వచ్చారు. వారు తెచ్చుకున్న వాహనం పాడవడంతో కార్యక్రమం అనంతరం కుంకలగుంటలోనే బస చేసేందుకు ఉపక్రమించారు. డీజేకు చెందిన యువకుడు బహిర్భూమికి వెళ్లడంతో అదే సమయానికి అక్కడికి వచ్చిన తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి కనుమూరి బాజీ చౌదరి ఆ యువకుడిని పిలిచి ఏ ఊరురా మీది ఏ కులం వాడివి అని అడిగాడు. క్రోసూరు మండలం అని ఎస్సీ వర్గానికి చెందిన వాడినని జనసేన పార్టీ కార్యక్రమానికి వచ్చానని ఆ యువకుడు బదులిచ్చాడు. బాజీ చౌదరి ఆ దళిత యువకుడిని కులంపేరుతో దూషిస్తూ తన ఇంట్లో బంధించేందుకు లాక్కెళ్లాడు. సదరు యువకుడి వెంట వచ్చిన వారిని పిలిపించి వారి ఫోన్‌ను పగులగొట్టి వారిపై కూడా దాడి చేయించాడు. బాజీచౌదరి తనవాళ్లతో కలిసి నలుగురు యువకులను చితకబాది తీవ్రంగా గాయపరిచాడు. జనసేన పార్టీ కార్యక్రమ నిర్వాహకులు వచ్చి చెప్పినా వినకుండా దాడిచేస్తూ బెదిరించాడని బాధితులు కన్నీరుమున్నీరవుతున్నారు. కుంకలగుంట గ్రామంలో నిర్వహించిన జనసేన జెండా ఆవిష్కరణకు ఆహ్వానించగా పోవడంతో వారిపై అక్కసుతో కులసహిత వచ్చిన దళిత వర్గాల యువకులను చితకబాదారని దళితవర్గాల నాయకులు మండిపడుతున్నారు. దళిత యువకులు పోలీసులకు సమాచారం అందించగా సంఘటనా స్థలానికి పోలీసులు చేరుకున్నారు. బాజీచౌదరిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసునమోదు చేసి అరెస్ట్ చేయాలని దళితసంఘాల నేతలు డిమాండ్ చేస్తున్నారు.





హత్య కేసులో నిందితుల అరెస్ట్

మహిళ సహా తొమ్మిది మందిని అరెస్ట్ చేసిన పోలీసులు

తెనాలిరూరల్: భర్త హత్యకు దారి తీసిన దంపతుల గొడవ వ్యవహారం కేసు నమోదవగా, తొమ్మిది మంది నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. స్థానిక కొత్తపేటలోని రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో డీఎస్పీ బి.జనార్దనరావు వివరాలు తెలిపారు. కొలకలూరు గ్రామ ఎస్సీ కాలనీకి చెందిన మృతుడు గేరా వాసు పెయింట్ పనిచేస్తూ జీవనం సాగించేవాడు. గ్రామానికి చెందిన బత్తుల అబ్రహాం కూతురు వెన్నెలను నాలుగేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నాడు. వాసు తల్లి అనారోగ్యానికి గురవడంతో ఆమెకు సపర్యలు చేసేందుకు వెన్నెల వెళ్లింది. ఈ క్రమంలో 25వ తేదీన వెన్నెల తండ్రి అబ్రహాం, బాబాయి కలిసి ఆమె ఇంటికి వచ్చారు. అక్కడ కూతురు పెట్టె చాకిరీ చేస్తుండటం చూసి అల్లుడు వాసుని ప్రశ్నించడంతో ఇరువురి మధ్య ఘర్షణ జరిగింది. అక్కడి నుంచి వెళ్లిపోయిన వారు తమ కూతురు పడుతున్న బాధల గురించి గ్రామంలోనే ఉంటున్న తన అక్క తోటల మేరీకి అబ్రహాం, అతని తమ్ముడు చెప్పుకుని బాధపడ్డారు. అనంతరం మేరీ తన భర్త, ఇద్దరు కొడుకులను తీసుకుని వాసు ఇంటికి వెళ్లి మద్యంమత్తు దిగి అంతా కలిసి వాసుపై దాడి చేశారు. వాసుతో పాటు అతడి తమ్ముడు గోపి, మేనమామ తిరుపతిరావుపై కూడా దాడికి దిగారు. ఆ సమయంలో పాత కక్షలు మనసులో పెట్టుకున్న వెన్నెల బావ అయిన తోకల అరవింద్ తన స్నేహితులు మాతంగి ప్రశాంత్, గోళ్ల జయంత్, కందర్ల ప్రవీణ్, కోట రవికుమార్‌లతో కలిసి అక్కడకు చేరుకుని వాసుపై విచక్షణారహితంగా దాడి చేశారు. కత్తులు, గొడ్డలి, స్క్రూ డ్రైవర్‌తో వాసుపై దాడి చేయడంతో తీవ్రంగా గాయపడిన బంధువులు ప్రభుత్వాస్పత్రికి తీసుకు వెళుతుండగానే అతడు మృతి చెందాడు. దీనిపై వాసు మేనమామ తిరుపతిరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్ఐ సీహెచ్ వెంకటేశ్వర్లు కేసు నమోదు చేయగా సీఐ కె.శ్రీనివాసరెడ్డి దర్యాప్తు చేపట్టారు. కేసులో నిందితులుగా ఉన్న మొత్తం తొమ్మిది మందిని అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేశారు.

